నేడు, రేపు

హెచ్‌సీయూలో వర్క్‌షాప్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో రెండురోజుల జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను బుధ, గురువారాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ బీజేరావు, ఉన్నత భారత్‌ అభియాన్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ రావుల కృష్ణయ్య, భారత బయోటెక్‌ ఇంటర్నేషనల్‌ చైర్మన్‌ డాక్టర్‌ కృష్ణా ఎల్లా, ఎస్‌ఎస్‌ఈ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీకాంత్‌శర్మ, ఐఓఈ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘణశ్యామ్‌ కృష్ణ, ఉన్నత్‌ భారత్‌ అభియాన్‌ ఎన్‌సీఐ న్యూఢిల్లీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ పీకే సింగ్‌ పాల్గొంటారు. గురువారం ఉదయం 11.30 గంటలకు జరిగే కార్యక్రమంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు , చేవెళ్ళ పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌ రెడ్డి, ఎన్‌ఐఆర్‌డీ డైరెక్టర్‌ జనరల్‌ డాక్టర్‌ జి నరేంద్ర కుమార్‌ పాల్గొంటారు.

9న 'మనూ' వ్యవస్థాపక దినోత్సవం

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 9వ తేదీన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వైస్‌ ఛాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 'మనూ' ఛాన్స్‌లర్‌ ముంతాజ్‌ అలీ, గౌరవ అతిథిగా అలీఘడ్‌ ముస్లిమ్‌ విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ ఛాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ తారీఖ్‌మన్సూర్‌ , రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఇష్తియాక్‌ అహ్మద్‌ , ప్రొఫెసర్లు పాల్గొంటారు.

ఆర్థికసాయం అందజేత



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సుదర్శన్‌నగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న చక్రపాణి వైద్య చికిత్సకు కాలనీ వాసులు రూ. 50 వేల ఆర్థికసాయంను సోమవారం రాత్రి అందజేశారు. కొద్ది కాలం క్రితం మూడవ ఫ్లోర్‌ నుంచి పడిన చక్రపాణి వెన్నుముక, కాలు విరిగింది. దీంతో సుదర్శన్‌నగర్‌ సంఘమిత్ర సొసైటీ ప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు.

జాతీయ సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: హెచ్‌సీయూలో ఇన్‌స్టిట్యూషన్‌ ఆఫ్‌ ఎమినెన్స్‌, పొలిటికల్‌ సైన్స్‌ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9,10 తేదీలలో 'అండర్‌ స్టాండింగ్‌ ఎలక్టోరల్‌ ఔట్‌ కమ్స్‌ ఇన్‌ ఇండియన్‌ స్టేట్స్‌, లోక్‌సభ ఎన్నికలు–2024' అనే అంశంపై సదస్సు ఉంటుంది. ప్రారంభ సమావేశంలో న్యూఢిల్లీలోని లోక్‌నీతి సీఎస్‌డీఎస్‌ ప్రొఫెసర్‌ సంజయ్‌ కుమార్‌, పొలిటికల్‌ సైన్స్‌ మాజీ ప్రొఫెసర్‌ కేసీ సూరి, ప్రొఫెసర్లు ఈ వెంకటేష్‌, డాక్టర్‌ డి వీరబాబు పాల్గొంటారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



విద్యార్థులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్‌ సీఐ ముత్తు యాదవ్‌ తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మంగళవారం ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్‌ నిబంధనలు పాటించకపోవడం వల్ల కలిగే నష్టాల గురించి, ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ను జంప్‌ చేయడం వల్ల కలిగే ఇబ్బందుల గురించి ఆడియో, వీడియోల ద్వారా విద్యార్థులకు ట్రాఫిక్‌ సిఐ ముత్తు యాదవ్‌ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ పాటించకపోవడం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతాయని, సిగ్నల్స్‌ ఖచ్చితంగా పాటించాలన్నారు. డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఉంటేనే వాహనం నడపాలన్నారు. అతి వేగం ప్రమాదకరమన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ వెంకటయ్య, పోలీస్‌ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌.. జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 17 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 1500 జరిమాన, ఏడుగురికి రూ.2 వేలు, ఆరుగురికి రెండువేల జరిమానాతో పాటు ఒకరికి రెండురోజుల జైలు విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు తెలిపారు.

మేయర్‌ ఆకస్మిక తనిఖీలు

పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచాలి ● శేరిలింగంపల్లి, మియాపూర్‌లో పర్యటన



మయూరినగర్‌లో పార్కును పరిశీలిస్తున్న మేయర్‌, ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ శ్రీకాంత్‌ తదితరులు



నల్లగండ్ల మార్కెట్‌లో..

శేరిలింగంపల్లి/మియాపూర్‌: ప్రభుత్వం నగరం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి అన్నారు. ప్రతిరోజూ ఎప్పటికప్పుడు చెత్తను తరలించి రోడ్లు శుభ్రం చేయాలని, పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపర్చాలని ఆదేశించారు. మంగళవారం మేయర్‌ శేరిలింగంపల్లి, మియాపూర్‌ డివిజన్లలో పర్యటించారు. ఆమె వెంట పీఏసీ చైర్మన్‌,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఉన్నారు. నాలాలు, చెరువులు, రైల్వే అండర్‌బ్రిడ్జి, నల్లగండ్ల మార్కెట్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యంపై అసహనం వ్యక్తం చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్‌, రాగం నాగేందర్‌యాదవ్‌, జీహెచ్‌ఎంసీ అధికారులు ఉన్నారు.

ఆర్‌యూబీ పనులకు మరో రూ.2 కోట్లు మంజూరు చేస్తాం..

లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జిని మేయర్‌ పరిశీలించారు. వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అండర్‌ బ్రిడ్జి వద్ద బాక్స్‌కల్వర్ట్‌, వరద నీటి కాలువ నిర్మాణం కోసం మరో రూ.2 కోట్లు అవసరమని ఎమ్మెల్యే గాంధీ, అధికారులు ఆమె దృష్టికి తేగా మంజూరు చేస్తానన్నారు. అనంతరం నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో షెడ్ల మరమ్మతు, ప్రహరీగోడ ఎత్తు పెంపు, ఇతర సౌకర్యాల గురించి తెలుపగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ గుల్‌మొహర్‌పార్కు సిగ్నల్‌ వద్ద ట్రాఫిక్‌ సమస్యను ఆమె దృష్టికి తేగా రోడ్డు విస్తరణ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఆ తర్వాత జోనల్‌ కార్యాలయం ఎదురుగా చేపట్టిన ప్రధాన రహదారి విస్తరణ పనులను ఆమె పరిశీలించారు.

మియాపూర్‌లో చెరువులు, నాలాల పరిశీలన

మియాపూర్‌లోని మయూరినగర్‌ పార్కు, మక్తమహబూబ్‌పేట్‌ చెరువు, పటేల్‌ చెరువు నాలాను పరిశీలించారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త, మురుగును చూసి మేయర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుల తరబడి చెత్త పేరుకుపోయినా ఎందుకు తొలగించ లేదని అసహనం వ్యక్తం చేశారు. అలాగే మయూరినగర్‌ పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మక్త చెరువు చుట్టూ చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి, డీసీ ముకుందరెడ్డి, ఈఎన్‌సీ భాస్కర్‌, ఎస్‌సీ శంకర్‌, ఈఈ దుర్గాప్రసాద్‌, డీఈ ఆనంద్‌, ఏఈ భాస్కర్‌, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామని కొండాపూర్‌ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎన్‌ఐఏ ఆఫీస్‌, అలేఖ్య హోమ్స్‌, గౌసియా కేఫ్‌, వసంత సిటీ, సైబర్‌ విలేజ్‌, సైబర్‌ వ్యాలీ, ఇజ్జత్‌నగర్‌, ఎస్‌బీఐ కాలనీ, వివేకానందనగర్‌, ఖానామెట్‌, మాతా భువనేశ్వరీ కాలనీ, సీసీఆర్‌టీ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలో..

చందానగర్‌: వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో.. విద్యుత్‌ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఇక్రిశాట్‌ ఫీడర్‌ పరిధిలో.. దీప్తిశ్రీనగర్‌ రోడ్డు నంబర్‌ 14, డీపీఎస్‌ స్కూల్‌, ఆర్వీ నిర్మాణ్‌, గ్రీన్‌ హిల్స్‌ అపార్ట్‌మెంట్స్‌, అయ్యప్పస్వామి టెంపుల్‌ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదన్నారు.

చందానగర్‌లో..

చందానగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- ఆర్టీసీ కాలనీ ఫీడర్‌ పరిధిలో.. ఆర్టీసీ కాలనీ, మంజీరా పైప్‌లైన్‌ రోడ్డు ప్రాంతాలలో..

అడ్డగుట్ట ఫీడర్‌ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా.. అడ్డగుట్ట ఫీడర్‌ పరిధిలోని 33/11కెవి హెచ్‌ఎంటి హిల్స్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెస్ట్రన్‌ హిల్స్‌, అడ్డగుట్ట రోడ్డు నంబర్‌ 1 నుంచి 7 వరకు

- అదే విధంగా 11కెవి పద్మావతి ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పద్మావతి నగర్‌, కేపీహెచ్‌బీ మెయిన్‌ రోడ్డు, కళామందిర్‌ రోడ్డు, భాగ్యనగర్‌లో 11కెవి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అడ్డగుట్ట, శ్రీరాంనగర్‌, ఆదిత్యానగర్‌, వెస్ట్రన్‌ హిల్స్‌, ఫేజ్‌ -2, శ్రీనివాసం అపార్టుమెంట్‌
- హెచ్‌యంటీహిల్స్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జలవాయువిహార్‌, ఆదిత్యనగర్‌, ప్రగతినగర్‌ రోడ్డు, శ్రీరాంనగర్‌, సాయి ప్రశాంత్‌నగర్‌, సాయికృష్ణ నగర్‌, శుభోదయా కాలనీ, భాగ్యనగర్‌ ఫేజ్‌ 1, అర్జున్‌ థియేటర్‌ రోడ్డు, జయనగర్‌, అరుణ సొసైటీ ప్రాంతాల్లో విద్యుత్‌ నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

తవ్విన గుంతలను పూడ్చాలి

మణికొండ: పైప్‌లైన్లు ఏర్పాటు, మరమ్మతుల సందర్భంగా తవ్విన గుంతలను వెంటనే పూడ్చివేయాలని బీఆర్‌ఎస్‌ నాయకులు మంగళవారం జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేశారు. మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి. సీతారాం ఆధ్వర్యంలో పలువురు నాయకులు మాట్లాడుతూ హుడా కాలనీ, లాలమ్మ గార్డెన్‌ కూడలి, అంజలి గార్డెన్‌ల వద్ద పైప్‌లైన్‌లు తదితరాల నిమిత్తం జలమండలి సిబ్బంది తవ్వి అలాగే వదిలేయడంతో పలువురు గాయాలపాలయ్యారన్నారు. గండిపేట నుంచి హైదరాబాద్‌ నగరానికి నీటిని తరలిస్తున్న క్యాండూట్‌ పలు చోట్ల లీకేజీలు ఏర్పడి నీరు పారుతుండడంతో రోడ్లన్నీ పాడవుతున్నాయన్నారు. తగు చర్యలు తీసుకుంటామని జలమండలి డీఈ మహేందర్‌నాయక్‌ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, జి.నరేందర్‌, జి.విఠల్‌, ఎస్‌. శ్రీకాంత్‌, రాజేంద్ర ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

'దాడులు హేయమైన చర్య'

శేరిలింగంపల్లి: బీజేపీ ఆఫీస్‌పై దాడి కాంగ్రెస్‌ ప్రభుత్వ అరాచకాలకు నిదర్శనమని బీజేపీ సీనియర్‌ నాయకులు నీరటి చంద్రమోహన్‌ విమర్శించారు. సోమవారం బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్‌ నాయకులు చేసిన దాడులతో హైదరాబాద్‌ ఇమేజ్‌ దెబ్బతినడంతో పాటు అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. దాడిలో పాల్గొన్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రమోహన్‌ డిమాండ్‌ చేశారు.

హైడ్రాకు ఫిర్యాదు

శేరిలింగంపల్లి: చందానగర్‌ సర్కిల్‌ పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని హైడ్రా కమిషనర్‌ ఏవీ.రంగనాథ్‌కు మదర్‌ సేవా సమితి చైర్మన్‌ బద్దం కొండల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. చెరువులు, కుంటల బఫర్‌జోన్స్‌, ఎఫ్‌టీఎల్‌ ఏరియాలతో పాటు ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా ఇరిగేషన్‌, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు. ఆయా నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టడీ మెటీరియల్‌ అందజేత

మియాపూర్‌: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌ యాదవ్‌ అన్నారు. మియాపూర్‌, మక్త గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సందయ్య మెమోరియల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్‌ నాయకులు నాగులుగౌడ్‌, మాణిక్‌రావు, రాజేష్‌గౌడ్‌, లక్ష్మణ్‌, గణేష్‌, రామకృష్ణారెడ్డి, కిరణ్‌, రాము, సురేష్‌ తదితరులున్నారు.

'బీఐఎంఎల్‌'ను ప్రారంభించిన ఏఐసీ టీహబ్‌



కార్యక్రమంలో టీహబ్‌ తాత్కాలిక సీఈఓ సుజిత్‌ జాగిర్దార్‌, వివిధ సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: భారతదేశపు ప్రముఖ స్టార్టప్‌ ఇంక్యుబేటర్‌ మంగళవారం ఏఐసీ టీహబ్‌ ఫౌండేషన్‌ మార్గదర్శకత్వంలో 'బిజినెస్‌ ఇంక్యుబేషన్‌ మేనేజ్‌మెంట్‌ అండ్‌ లీడర్‌షిప్‌(బీఐఎంఎల్‌) ప్రోగ్రామ్‌ను లాంఛనంగా ప్రారంభించింది. శిక్షణ, వ్యూహాత్మక పరిజ్ఞానం, పరిశ్రమల అనుసంధానంతో ఇంక్యుబేటర్‌లకు సాధికారత కల్పించేందుకు ఈ కార్య క్రమం రూపొందించబడింది. ఏఐసీ టీహబ్‌ ప్రోగ్రామ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా ఎడ్యుటెక్‌, అకాడెమియా, స్పోర్ట్స్‌, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్‌ ఇంక్యుబేషన్‌ రూపొందిస్తోంది. 15 విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. దేశంలో బలమైన, డైనమిక్‌ ఇంక్యుబేషన్‌ ఎకోసిస్టమ్‌ను పెంపొందిడమే లక్ష్యమని ఏఐసీ టీహబ్‌ ఫౌండేషన్‌ ఈఈఓ రాజేష్‌ స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీహబ్‌, ఏఐసీటీ హబ్‌ ఫౌండేషన్‌, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి



జెడ్‌సీ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌ పరిధిలో సీసీ రోడ్లు నిర్మించాలని జీహెచ్‌ఎంసీ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డిని కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ కోరారు. మంగళవారం జోనల్‌ కమిషనర్‌ కార్యాలయంలో కలిసి డివిజన్‌ పరిధిలోని తారానగర్‌, రాజీవ్‌ గృహకల్ప, గోపీనగర్‌, నెహ్రూనగర్‌, బాపూనగర్‌లలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కాలనీల్లో రోడ్లు దెబ్బతినడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారని వివరించారు. పార్టీ డివిజన్‌ గౌరవాధ్యక్షులు వీరేశం గౌడ్‌, రవీందర్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

వరద నీటి కాలువ పనులు పరిశీలన



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని నిజాంపేట్‌ రోడ్డు, హోలిస్టిక్‌ హాస్పిటల్‌ వద్ద చేపడుతున్న వరద నీటి కాలువ పనులను జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్‌ అధికారులతో డివిజన్‌ కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో అవసరం ఉన్న చోట, నిత్యం సమస్య ఏర్పడుతున్న ప్రాంతాల్లో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసి ఏఈ రాజీవ్‌, వర్కు ఇన్‌స్పెక్టర్‌ మహదేవ్‌, వాటర్‌వర్క్స్‌ ఇన్‌చార్జ్‌ డీజీఎం శంషేర్‌, మేనేజర్‌ ప్రశాంతి, నాయకులు, డివిజన్‌వాసులు పాల్గొన్నారు.

క్రికెట్‌ టోర్నమెంట్‌ విజేత పవన్‌ -11 జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

చందానగర్‌: చందానగర్‌ పీజేఆర్‌ స్టేడియంలో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో తాండ్రకుమార్‌ మెమోరియల్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ నిర్వహించారు. మంగళవారం జరిగిన పోటీలలో 16 జట్లు పాల్గొనగా ఐలాపూర్‌ వారియర్స్‌, పవన్‌ -11 జట్లు ఫైనల్‌కు చేరాయి. ఇందులో పవన్‌ 11 జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ఎంసీపీఐయూ నాయకులు తాండ్ర రమేష్‌ బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో పల్లె మురళీ అరుణ్‌, శ్రీకాంత్‌, ఎంసీపీఐయూ నాయకులు దశరథ్‌ నాయక్‌, కృష్ణ, తాండ్ర కళావతి, మహిళా నాయకులు అంగడి పుష్ప, అనిత, శివాని, సుల్తానా బేగం , తాండ్ర వేణు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీపై అవగాహన కల్పించాలి

హెచ్‌సీయూ వీసీ



పోస్టర్‌ను ఆవిష్కరించిన వీసీ బీజే రావు, రిజిస్ట్రార్‌ డాక్టర్‌ దేవేష్‌నిగమ్‌

రాయదుర్గం: హ్యూమన్‌ మెటా న్యుమో వైరస్‌ (హెచ్‌ఎంపీవీ)పై క్యాంపస్‌లో అవగాహన కల్పించాలని హెచ్‌సీయూ వైస్‌ ఛాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ బీజే రావు అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ హెల్త్‌ సెంటర్‌ క్యాంపస్‌లో మంగళవారం వైరస్‌పై అవగాహన కార్యక్రమం, పోస్టర్‌ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్‌లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందు జాగ్రత్తలపై పోస్టర్లను అంటించి అవగాహన కల్పించాలన్నారు. రిజిస్ట్రార్‌ డాక్టర్‌ దేవేష్‌ నిగమ్‌ మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో వైరస్‌ వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్‌ సెంటర్‌ వైద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



శేరిలింగంపల్లి: నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.పుష్ప డిమాండ్‌ చేశారు. మంగళవారం సమాఖ్య ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పుష్ప మాట్లాడుతూ అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, రేషన్‌ షాపుల్లో 14 రకాల నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచడంతో పాటు సన్న బియ్యం కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి కళావతి, గ్రేటర్‌ అధ్యక్షులు అనిత, గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ సభ్యులు శివాని, రాణి, సుల్తానా బేగం, లలిత, విమల, రజియా బేగం, ఇందిర, అమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల సర్వే



సర్వేను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ ఎల్లమ్మబండ పరిధి కేటీఆర్‌ కాలనీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ మున్సిపల్‌ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సొంత స్థలం కానీ, రేకుల షెడ్డు ఉన్న వారికి ప్రభుత్వం తరపు నుంచి 5 లక్షల ఆర్థిక సాయం అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్‌,జిల్లా గణేష్‌, షౌకత్‌ ఆలీమున్నా, పోశెట్టి గౌడ్‌, వెంకటేష్‌, షకీల్‌ మున్నా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారుల పేర్లు సర్వే డేటాలో లేవు: కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి

శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానందనగర్‌ డివిజన్‌లోని రిక్షాపుల్లర్స్‌ కాలనీ, రామకృష్ణనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు మంగళవారం పరిశీలించారు. అదే విధంగా కాలనీలో శానిటేషన్‌, సీవరేజ్‌, ఎలక్ట్రికల్‌ తదితర సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు సర్వే డేటాలో చాలా వరకు లేవన్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.కార్యక్రమంలో జీహెచ్‌యంసీ సీఓ పాపాగౌడ్‌, విద్యుత్‌ ఏఈ పీరునాయక్‌, వాటర్‌వర్క్స్‌ మేనేజర్‌ ప్రియాంక, కాలనీల సభ్యులు ఆల్వాల్‌, గిరిబాబు, మాచర్ల భద్రయ్య, లింగయ్య, కృష్ణ, మల్లేష్‌, మధు, ప్రవీణ్‌, జగదీష్‌ గౌడ్‌, మాధవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్‌: చిట్కుల్‌ లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ను మంగళవారం పటాన్‌ చెరు ఎంపీడీఓ యాదగిరి, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌ గౌడ్‌ పరిశీలించారు. పటాన్‌చెరు మండల పరిధిలో సర్వేను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో చిట్కుల్‌ గ్రామపంచాయతీ కార్యదర్శి కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా హుడా రోడ్డు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మీదుగా ఉస్మాన్‌నగర్‌ వైపు వెళ్లే హుడా రోడ్డు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. తెల్లాపూర్‌, ఉస్మాన్‌నగర్‌, కొల్లూరు పరిధిలో అనేక కాలనీలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గం ప్రధాన రహదారిగా మారింది. వాహనాల రద్దీ పెరిగింది. గతంలో అధికారులు రోడ్డును కొంతమేర విస్తరణ చేసి డివైడర్‌ను ఏర్పాటు చేశారు. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు, స్కూల్‌ బస్సులు, టిప్పర్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా ఈ ప్రాంతంలో భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.దీంతో టిప్పర్‌లు ఎక్కువగా వస్తుంటాయి. వీటి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.దీనికి తోడు వాహనాలు అతి వేగంగా వస్తుండడంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది. గత ఏడాది కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే మహిళ కానిస్టేబుల్‌ ఈ మార్గంలోనే దుర్మరణం చెందింది. తాజాగా ఇద్దరు యువకులు టిప్పర్‌ను ఢీకొని మృతి చెందారు. ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



ప్రజలు ట్రాఫిక్‌ నిబంధలను పాటిస్తే ప్రమాదాలు జరగవు. ఈ మార్గంలో హెచ్చరిక బోర్డు, స్పీడ్‌ బ్రేకర్ల ఏర్పాటునకు కృషి చేస్తాం. అలాగే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి.

–ఇన్‌స్పెక్టర్‌ రవీందర్‌, కొల్లూరు



హుడా రోడ్డు